ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ స్థలం కబ్జా

- సెవెన్ టూంబ్స్ రోడ్డులో 1120మీటర్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- ప్రహరీ కూల్చిన కబ్జాదారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తహసీల్దార్

సెవెన్ టూంబ్స్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో పరిశీలన చేస్తున్న ఆర్డీవో దశరథ్, తహసీల్దార్ అనితారెడ్డి తదితరులు

బంజారాహిల్స్, జూన్ 14: ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది ఒకవైపు తొలగిస్తున్నా కబ్జాదారులు ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు. షేక్‌పేట మండల పరిధిలో ఏకంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని సైతం దర్జాగా కబ్జా చేయడం కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండల పరిధిలోని సర్వే నంబర్ 179లో టీఎస్ 15/2, బ్లాక్- ఎం, వార్డు-13లో టోలిచౌకి సెవన్‌టూంబ్స్ రోడ్డులో సుమారు 1120 మీటర్ల ఖాళీ ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ స్థలంగా పేర్కొనడంతోపాటు ల్యాండ్ బ్యాంక్‌లో ఉంచారు. కొత్తగా నిర్మించతలపెట్టిన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కోసం స్థలాన్ని కేటాయించారు. కాగా పక్కనే ఉన్న ప్రైడ్ ఇండియా లే అవుట్ ప్లాట్ ఓనర్స్ కొంతకాలంగా ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. పలుమార్లు ప్రహరీ గోడను కూల్చే ప్రయత్నం చేయగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. తాజాగా ఇటీవల మరోసారి సయ్యద్ ఇమాద్ అహ్మద్, సయ్యద్ ఫాద్ అహ్మద్ అనే వ్యక్తులు మరోసారి ప్రభుత్వ స్థలం చుట్టూ ఉన్న ప్రహరీ కూల్చేసి స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించారు. ఈ విషయాన్ని గుర్తించిన రెవెన్యూ సిబ్బంది ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటిదాకా కేసు నమోదు చేయలేదు. దీంతో శుక్రవారం సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్‌సింగ్, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్, ఫిలింనగర్ డీఐ జయరాం తదితరులు స్థలం వద్దకు వెళ్లి పరిశీలన చేపట్టారు. పోలీసుల బందోబస్తు నడుమ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. వెంటనే కబ్జాదారులమీద కేసు నమోదు చేయడంతో పాటు వారిని అరెస్ట్ చేయాలని తహసీల్దార్ అనితారెడ్డి ఫిలింనగర్ పోలీసులను కోరారు.

సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు

హిమాయత్‌నగర్‌లోని టీటీడీలో సూర్యప్రభ వాహనంపై స్వామి వారి ఊరేగింపు

హిమాయత్‌నగర్, జూన్14: తిరుమలేశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని లిబర్టీ వద్ద గల తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు జరిగింది. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యల్లో తరలిరావడంతో స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నేడు గజ వాహనంపై శ్రీవారి ఊరేగింపు, ఉదయం10 గంటలకు శాంతి కల్యాణం, రాత్రి 8 గంటలకు గరుడ వాహనంపై ఊరేగింపు ఉంటుందని టీటీడీ ఉప కార్యనిర్వహణ అధికారి ఎం.రమేశ్‌బాబు, దాత వై.టివి త్రినాథ్‌బాబు తెలిపారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

సమావేశంలో మాట్లాడుతున్న నార్సింగి మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం

మణికొండ, జూన్ 14: పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు తలెత్త వద్దని నార్సింగి మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం అన్నారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం శానిటేషన్ జవాన్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా నిర్వహించాలన్నారు. వ్యర్థాలను వేసేందుకు ఇంటింటికీ ప్రజలకు కవర్లను అందజేయాలి సూచించారు. కవర్లల్లో వేసిన చెత్త ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త సేకరణ ఆటోలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉంచుకొని ఎప్పటికప్పుడు వ్యర్థాలను తరలించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు చేగువేరా జీవితం ఆదర్శం

చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జూన్ 14: విప్లవ పోరాట యోధుడు చేగువేరా జీవితం యువతకు ఆదర్శమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ తెలిపారు. చేగువేరా 96వ జయంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గెరిల్లా పోరాటంతో ప్రజలను బానిసత్వం నుంచి విముక్తి చేసిన యోధుడు అని కొనియాడారు. ఆయన ఆశయాలతో అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం యువత పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ, నేతలు షేక్ మహమూద్, మాజీద్ అలీఖాన్, కల్యాణ్, ముఖేశ్, జగన్‌గౌడ్, సందీప్, వినోద్, లతీఫ్, హసీం పాల్గొన్నారు.

నిమ్స్‌లో రక్తదాన శిబిరం

ఖైరతాబాద్, జూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిమ్స్ దవాఖానలోని బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డైరెక్టర్ డాక్టర్ నగరి బిరప్ప ప్రారంభించారు. ఆస్పత్రిలో పనిచేసే వివిధ శాఖల ఉద్యోగులు, వైద్య విద్యార్థులు బ్లడ్ బ్యాంకు వైద్యులు డాక్టర్ మహేశ్, డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళీకృష్ణ, మీడియా రిలేషన్ అధికారి సత్యగౌడ్‌తో పాటు సుమారు 150 మంది రక్తదానం చేశారు. రక్తదాతలను డైరెక్టర్ బీరప్ప, బ్లడ్ బ్యాంకు విభాగాధిపతి డాక్టర్ శాంతి సత్కరించారు.

రక్తదానం చేయడం దార్శనికత



రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్, జూన్ 14: రక్త దానం చేయడం గొప్ప దార్శనీకత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజ్‌భవన్ రోడ్‌లోని సంస్కృతి భవన్‌లో రాజ్‌భవన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి పొన్నం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానంపై అపోహ వీడాలన్నారు. ఒక మనిషి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. త్వరలోనే ప్రతి వంద బెడ్ల దవాఖానలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసేలా సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. రెడ్‌క్రాస్ వాహనాలకు ప్రభుత్వం తరపున పన్నుల మిన్హాయింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్‌మిశ్రా, రాజ్‌భవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా జెడ్ చోంగ్తూ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, సీఈవో మధన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 14: ప్రతి విద్యార్థి తన ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల ఆవరణలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. కళాశాల విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ సత్యనారాయణ, అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మెడికల్ అధికారి డాక్టర్ సి.పద్మవేణి, డాక్టర్ నిఖిత, డాక్టర్ చైతన్య, పాల్గొని వైద్య సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

పెద్దతూప్ర ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జయమ్మ

శంషాబాద్ రూరల్, జూన్ 14: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి శంషాబాద్ ఎంపీపీ జయమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం శంషాబాద్ మండలం పెద్దతూప్ర ప్రభుత్వ పాఠశాలలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులను పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లోనిగూడలో అక్షరాభ్యాసం

పిల్లోనిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 14 ఏండ్లలోపు వారు చదువుకునే విధంగా తల్లిదండ్రులు చొరవతీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాధాకృష్ణ, రుక్మయ్య, ఆనంద్ కుమార్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ అంగన్‌వాడీ టీచర్లు అనిత, జ్యోతి, బీఆర్ఎస్ నాయకుడు రమేశ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కాటేదాన్ జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అందరి సహకారతో మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం, రఘుపతి, అడికే జనార్దన్, సాన్నెం శ్రీనివాస్‌గౌడ్, టి.చిన్న, ఎన్న కృష్ణారెడ్డి, పాండుయాదవ్, ఎల్వీ రెడ్డి, మధు, రవి, అమర్, ప్రభుదాస్, రామరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రనగర్‌లో సిమెంట్ స్తంభాల ఏర్పాటు

జూబ్లీహిల్స్, జూన్ 14: బస్తీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇంద్రనగర్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలకు పాత ఇనుప విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచివున్నందున సిమెంట్ స్తంభాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త స్తంభాలను వేసే పనులను పరిశీలించారు.

ప్రభుత్వ భూమిని విక్రయించిన సిరీస్‌పై చర్యలు తీసుకోవాలి

ఖైరతాబాద్, జూన్ 14: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రైవేట్ సంస్థలకు విక్రయించిన సిరీస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శ్యాంసుందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో రంగారెడ్డి జిల్లా బహదూర్‌లో సర్వే నంబర్ 49/13లో మొత్తం 58 ఎకరాల 20గుంటల ప్రభుత్వ భూమి ఉందని, అయితే అందులో 1968లో సిరీస్ కంపెనీకి ప్రభుత్వం 14 ఎకరాల 31గుంటల భూమిని ఎకరాకు రూ.3.500 చొప్పున విక్రయించిందన్నారు. అలాగే గ్రామ లే అవుట్ ప్రకారం 1,57,590 చదరపు గజాల భూమిని గుడి, బడి, పోలీస్ స్టేషన్లకు కేటాయించిందన్నారు. మొత్తం 48.20 ఎకరాల భూమి పోను మిగిలిన పది ఎకరాల భూమిని సిరీస్ కంపెనీ కబ్జా చేసి తప్పుడు డాక్యుమెంట్లతో డీమార్ట్, సృజన, టీఎంటీ విజన్ ఎలక్ట్రానిక్స్‌తో పాటు ఓ నిర్మాణ సంస్థకు అమ్ముకున్నదన్నారు. ఈ కబ్జాలపై 2017నే తమ కమిటీ సరూర్‌నగర్ తహసీల్దార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు తప్పుడు డాక్యుమెంట్ల వివరాలన్నింటిని అందించామన్నారు. అధికారులు స్పందించకపోవడంతో లోకాయుక్తాను సైతం ఆశ్రయించామన్నారు. అంతే కాకుండా పిల్ సైతం వేశామన్నారు. ప్రభుత్వ భూమిని సర్కారు తిరిగి స్వాధీనం చేసుకునేంత వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. సమావేశంలో హరిత్ రూడ, జిట్టా అయిల్‌రెడ్డి, మారోజు రామాచారి, భూషన్, మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

ఖానాపూర్ పాఠశాల సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ

మణికొండ, జూన్ 14: విద్యార్థులు అన్నిరంగాల్లో పాలుపంచుకున్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీలోని ఖానాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. మెరుగైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ్‌కుమార్, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, ఉషారాణి, ప్రవళికకిరణ్, గండిపేట మండల పీఏసీఎస్ చైర్మన్ తోటకట్ట కృష్ణ, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు లేకుండా చూస్తాం

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

దేవరకొండ బస్తీ ప్రభుత్వ పాఠశాలలో యూనిఫామ్స్, పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా, మెరుగైన విద్యాబోధన జరిగేలా చూస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.5లోని దేవరకొండబస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దానం, వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందుకోవచ్చన్నారు. ఉన్నత విద్యావంతులు ప్రభుత్వ స్కూళ్లలో టీచర్లుగా పనిచేస్తుంటారని, సరైన వసతులు కల్పిస్తే ప్రైవేటు స్కూళ్ల విద్యార్థుల కంటే మంచి ఫలితాలు సాధించే సత్తా ప్రభుత్వ విద్యార్థులకు ఉందన్నారు. బడిబాటలో భాగంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

బీఈడీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 18లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 21లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 25 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

శంషాబాద్ మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సుష్మ, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 14: మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి బట్టలు, సబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారికి అవసరమైన బట్టలు, సబ్బులు, ఇతర సామగ్రిని పంపిణీ చేస్తూ ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకొని అండగా ఉంటున్నామని వివరించారు. ప్రతిరోజు ఉదయం మున్సిపాలిటీ స్వచ్ఛత కోసం పనిచేసే కార్మికులకు మున్సిపల్ పాలకవర్గం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందితో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 17న బక్రీద్ సందర్భంగా వ్యర్థాల తొలగింపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఏఎమ్‌వోహెచ్ డాక్టర్ రవితో పాటు శానిటేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్

మహిళ ఆత్మహత్య

మణికొండ, జూన్ 14: భవనంపై నుంచి దూకి ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. నార్సింగి మై హోమ్ అవతార్ 14వ ఫ్లోర్‌లో జనార్దన్ రెడ్డి, అనురాధ ఉంటున్నారు. జనార్దన్‌రెడ్డి ప్రభుత్వ టీచర్, అనురాధా హైదరాబాద్ కమాండ్ కంట్రోల్‌లో సీనియర్ అసిసెంట్. శుక్రవారం 14వ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు విషయాన్ని నార్సిం గి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకోని వివరాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చరీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

బండ్లగూడ, జూన్ 14: మహారాష్ట్రకు చెందిన సలేశ్వరం(48) కిస్మత్‌పూర్‌లో ఓ ఇంటిని నిర్మాణంలో పని చేస్తున్నాడు. అతని ద్విచక్ర వాహనం పంచర్ కావడంతో అతను కొద్ది దూరం నెట్టుకుంటూ వచ్చి టైర్లలో గాలి కొట్టిస్తున్నాడు. ఇదిలా ఉంటే నీళ్లు తాగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

1962 పైలట్, డ్రైవర్ ఉద్యోగాలు

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 14 : పశు సంచార వైద్య సేవలందించే 1962 అంబులెన్స్‌లో పైలట్, డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90000 01674 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.